చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:నేర పూరితమైన పనులకు యువకులు దూరంగా ఉండాలని ఎస్సై బి.సతీష్ సూచించారు. మండలంలోని గూడ పంచాయతీ కొడేలి గ్రామంలో యువకులు, గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. నాటుసారా, గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడి యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. వీటిని నిర్మూలించే ప్రక్రియలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పిటిజి గ్రామాల్లో

కానరాని అంగన్‌వాడీ కేంద్రాలు

పౌష్టికాహారం అందక చిన్నారులు, గర్భిణులు, బాలింతల అవస్థలు

ప్రజాశక్తి - అనంతగిరి: దేశానికి స్వాతంత్ర్య వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆదివాసి పీటిజి పేద గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పలాలు అందని ద్రాక్షగానే మిగిలింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి పీటిజిలకు అధికంగా పథకాలు అందిస్తున్నట్లు ప్రచార ఆర్బాటాలు చేస్తున్నాయి తప్ప ఆచరణలో మాత్రం అమలు కాలేదు.

అల్లురి సీతారామరాజు జిల్లా అనంతగిరి పంచాయతీ తేనేపుటు, తెల్లరపాడు, వాలసి పంచాయతీ పుటపాడులోని వివిధ పీటీజి గ్రామాలకు నేటికీ విద్య, వైద్యం చిన్నారులకు, గర్భిణి, బాలింతలకు అందలేదు.

ఫౌష్టికాహారం అందని పిల్లలు

పౌష్టికహారం అందించిన దాఖలాలు లేవు.కనీసం అంగన్వాడీ కేంద్రం భవనం కూడా లేని పరిస్థితి నెలకొంది. గిరిజనులు ఎవరైనా అనారోగ్యానికి గురైె నప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొంది. తేనేపుటులో 12మంది, తెలరుపాడు, పుటపాడులో 25 మంది విద్యార్థులు ఉన్నపటికీ పాఠశాల లేక విద్యకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంది. బాలింతలు అంగన్వాడి కేంద్రానికి గెడ్డలు, కొండలు దాటి రేగం గ్రామానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తెలరాపాడు, పుటపాడు గ్రామాలకు చెందిన 25 మంది విద్యార్థులు, చిన్నారులు 32, బాలింతలు 11, గర్భిణులు 8 మంది పౌష్టికాహారం కోసం వాలసి పంచాయతీ సుమారు 3.కిల్లో మీటర్లు దూరం చీమగెడ్డ, బొడ్డెపాడు చేరుకున్ని రాయిపాడుకు వెళ్లాల్సి ఉంది. సరైన పౌష్టికాహారం అందక గర్భిణిలు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పీటీజి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, ఉప్ప సర్పంచ్ అర్జున్, వార్డు మెంబర్ జె.సుబ్బారావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదిమ జాతి గిరిజనులపై నిర్లక్ష్యం తగదని తెలిపారు. తక్షణమే పాఠశాల, అంగన్వాడీ వంటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్, పిఓల దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పిటిజి గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిడిఒ ఫణీంద్ర తదితరులు

కందులూరులో ఎంపిపి లక్ష్మి పర్యటన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని కుందులూరు పంచాయతీలో మంగళవారం ఎంపిడిఒ ఫణీంద్రతో కలిసి ఎంపిపి ఎంపీపీ కారం లక్ష్మి పర్యటించారు. గ్రామంలో వాటర్ ట్యాంకును వారు పరిశీలించారు. గ్రామంలో మంచినీటి సమస్యను ఎంపిడిఒకు ఎంపిపి వివరించారు. అనేక నెలలుగా గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, దీనిపై పలుమార్లు స్థానిక గ్రామం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారని, అయినా నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో ఎంపిడిఒ స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్, సంబంధిత అధికారులను మందలించారు. వెంటనే వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేసి మంచినీరు ఇవ్వాలని, లేకుంటే మెమో జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం దయ్యాల మడుగు, కన్నంపేట మధ్యలోని వాగును ఎంపిపి, ఎంపిడిఒ పరిశీలించారు. ఈ వాగు వద్ద చెక్ డ్యాం నిర్మిస్తే వాగు ఆయుకట్టు భాగంలో ఉన్న సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందించాలని ఎంపిపి కోరారు. దీనిపై ఎంపిడిఒ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి, వాగుపై చెక్ డ్యాం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుందులూరు, జల్లివారి గూడెం గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్న బాబు, నాయకులు గుండెపూడి లక్ష్మణరావు, రవ్వ బుచ్చయ్య, కార్యదర్శి, సర్పంచ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ద్రోహం

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు:క్రమబద్ధీకరణ చేయడం అంటే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడమా అని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను వైసిపి ప్రభుత్వం నమ్మించి ద్రోహం చేస్తుందని విమర్శించారు. మంగళవారం చింతపల్లి మండలం బలపం మారముల పంచాయతీ పిహెచ్సిలో ఈనెల 20న అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో జరుగనున్న సిఐటియు మొదటి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వ్యవస్థ లేకుండా చేస్తానని, ఉద్యోగులందరికీ క్రమబద్ధీకరణ చేసి పర్మినెంట్ ఉద్యో గాలు ఇస్తానని ప్రతిపక్ష హెూదాలో పాదయాత్రలో చెప్పిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాటలు నీటి మూటలుగా మిగిలాయని ఎద్దేవా చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ లేకుండా చేయడం అంటే ఉద్యోగాల నుంచి తొలగించడమా అని ప్రశ్నించారు. 10 సంవత్సరాలు లోపు సర్వీసున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులు రెండున్నర లక్షల మంది ఉన్నారన్నారు. ఐదేళ్ల దాటి పని చేసిన ఉద్యోగ, కార్మికుడికి పర్మినెంట్ చేయాలని చట్టంలో ఉందని గుర్తు చేశారు. ఒకవైపున దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయటం లేదా మూసేయటం చేస్తుంటే దీన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు వ్యవస్థని సమూలంగా రద్దు చేయడానికి పూనుకోవటం దారుణమన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కాలం చెల్లినట్టేనని, అందరూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తాజంగి, లంబసింగి, లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, సిఐటియు మండల కార్యదర్శి వేములపూడి రామకృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్ఐ షరీఫ్

యువతకు వాలీబాల్ కిట్ అందజేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డం పోలీస్ స్టేషన్ పరిధిలోని రత్నాలుపేట గ్రామ యువతకు ఎస్ఐ షరీఫ్ మంగళవారం వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలుపైనా ఆసక్తి కనబరిచాలని సూచించారు. యువత గంజాయి, మద్యం, కోడిపందాలు, పేకాట, గుండాట వంటి చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ పండ్లను పరిశీలిస్తున్న పిఒ

కాఫీ రైతులకు 24 గంటల్లో చెల్లింపులు

- ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:మ్యాక్స్ సంస్థకు కాఫీ పళ్ళను విక్రయిస్తున్న కాఫీ రైతులకు 24 గంటల్లో చెల్లింపులు చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం పాడేరు మండలం ఇసుకల గరువు గ్రామంలో పర్యటించి మ్యాక్స్ సంస్థ ఆధ్వర్యంలో కాఫీ పళ్ళు కొనుగోలును ఆయన పరిశీలించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని గ్రామస్తులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్వాడి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని టిడబ్ల్యూ ఇఇని ఆదేశించారు. గ్రామంలో 35 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించారు.

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పెదల బుడు మేజర్ పంచాయతీ పానిరంగని, కరసలిగూడ గ్రామాలలో మంగళవారం అరకు ఎమ్మెల్యే పాల్గుణ ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు మాట్లాడారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం చేయాలని, తర్వాత ప్రజా సమస్యలు తెలుసుకున్ని పరిష్కారం చేయడమే ప్రజాప్రతినిధులు లక్ష్యంగా పని చేయాలని ఆయన అన్నారు.గ్రామాల్లో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు భీమరాజు, శత్రుఘున్, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, పంచాయితీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలండర్ బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ఏజెన్సీలో విస్తరిస్తున్న 'లంపీ స్కిన్'

- ★ మృత్యువాత పడుతున్న పశువులు
- ★ పలు గ్రామాల్లో వ్యాధి బారిన పడ్డ మూగజీవులు
- ★ ఆందోళనలో రైతులు

లంపీస్కిన్ వ్యాధితో కింద్ర కాలనీలో మృతి చెందిన పడ్డపెయ్య

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రంపచోడవరం ఏజెన్సీలో లంపీ స్కిన్ వ్యాధి శరవేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో పశువులు మృత్యువాత చెందగా, అనేక పశువులు వ్యాధి బారిన పడ్డాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాజవొమ్మంగి మండలంలోని 19 పంచాయతీల్లో సుమారు 8వేలు ఆవులు, 2వేలు గేదెలు ఉన్నాయి. వీటిల్లో తెల్లజాతి ఆవులకు ఎక్కువగా లంపీ స్కిన్ వ్యాధి సోకుతుంది. ఇది సోకిన ఆవులకు తొలిత జ్వరం వస్తుంది. అనంతరం పెద్ద, పెద్ద మచ్చులు, బొబ్బెలు ఏర్పడి చర్మం అంద వికారంగా తయారవుతుంది. ఈ వైరస్ నుండి కొన్ని తెల్లజాతి పశువులు తేరుకోగా కొన్ని మృతి చెందుతున్నాయి. మండలంలోని రాజవొమ్మంగి, కింద్ర, లాగరాయి, వాతంగి తదితర పంచాయతీల్లో నెలరోజుల వ్యవధిలో సుమారు పదికి పైగా పశువులు మరణించాయి. ఏజెన్సీలో వందలాది పశువులు ఈ వ్యాధి బారిన పడి మృత్యువుతో పోరాడుతున్నాయి. కింద్ర కాలనీ గ్రామంలో సోమవారం లంపీ స్ర్కీన్‌తో రెండు పశువులు మృత్యువాత పడగా, కొన్ని పశువులు వ్యాధితో బాధపడుతున్నాయి. ఈ వైరస్ సోకకుండా తొలిత పశు వైద్యాధికారులు నివారణ టీకాలు వేసినప్పటికీ వైరస్ ప్రభావం ఇంకా ఏజెన్సీలో కొనసాగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు వ్యవసాయ సీజన్‌లో దుక్కులకు, బండ్లకు ఉపయోగపడే తెల్లజాతి ఎద్దులు సైతం ఈ వైరస్ బారినపడి మత్యువాత పడుతున్నాయని, దీంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి లంపీ స్కిన్ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలి

తెల్లజాతి పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. ఉన్నతాధికారులు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలి. మిగతా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

- గంటిమళ్ళ అచ్చిపాత్రుడు, కింద్ర కాలనీ గ్రామం.

రైతులను ఆదుకోవాలి

లంపీ స్కిన్ వ్యాధితో మండలంలోని అనేక మంది రైతులకు చెందిన పశువులు మరణించడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నాం. పశువులను కోల్పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గంపా నాగరాజు, కింద్ర కాలనీ గ్రామం

రైతులు జాగ్రత్తలు పాటించాలి

తెల్లజాతి పశువులకు లంపీ స్కిన్ వ్యాధి వల్ల మృత్యువాత పడడంతో పాటు, చాలా పశువులు ఈ వైరస్ నుంచి కోలుకుంటున్నాయి. ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలిగుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ప్రస్తుతం పశువులకు బ్రుసెల్లా టీకా వేయడం జరుగుతుంది. రైతులు జాగ్రత్తలు పాటించాలి.

- తరుణ్, పశువైద్యాధికారి, రాజవొమ్మంగి.

ప్రధాన రహదారిలో పహారా కాస్తున్న పోలీసులు

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు సందర్భంగా ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు కంచుకోటగా ఉన్న ఏవోబిలో జల్లెడ పడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా చేసుకొని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోవచ్చని ఇంటలిజెన్స్ వర్గాల హెచ్చరికలు నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఒడిశాలోని మల్కనగిరి జిల్లా పోలీసు బలగాలు పప్పులూరు, కురమనూరు, కలిమేల బ్లాక్, నాగులూరు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. వారోత్సవాలు నేపథ్యంలో పోలీసు కూంబింగ్ ఎక్కువగా ఉండటంతో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

కొయ్యూరు : మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు తరుణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏరియా డామినేషన్ ప్రోగ్రామ్స్ వాహనాల తనఖీలు చేపట్టారు. మంప ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యాన భద్రత చర్యల్లో భాగంగా చిడిపాలెం నుండి బూదరాళ్ల వరకు తనిఖీలు చేశారు.

ప్రభుత్వ, దేవాదాయ భూములపై

శ్వేత పత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఎటపాక

మండలంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ, దేవస్థానం భూములను కచ్చితమైన సర్వే చేసి, లెక్కలు తేల్చి శ్వేత పత్రం విడుదల చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇర్పా అజయ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కాక అర్జున్ దొర డిమాండ్ చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటపాక ఏజెన్సీలో పీసా గ్రామసభలు నిర్వహించకుండా, అనుమతులు లేకుండా, 1/70 చట్టాలకు తూట్లు పొడుస్తూ అక్రమంగా గుండాల పంచాయతీలో జరుగున్న ఇసుక ర్యాంపులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి పటిష్టమైన ఏజెన్సీ చట్టాలను రక్షణ కలిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు అపకా సమ్మక్క, సోయం వీరమ్మ, కారం నాగేష్, పెనుబల్లి భీస్మారావు, సీసం కొండ, ఇర్పా కోటి, మాటూరి బాలు, ఇరపా హరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి అజయ్‌కుమార్

ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేకపల్లిలో మంగళవారం జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ మండల మహాసభలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. కూర ముత్తమ్మ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో మండ కమిటీ మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఉయిక, కూర ముత్తమ్మ, కోశాధికారిగా మెట్టుం అనితతో పాటు 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఆశా వర్కర్ల సమస్యలపై సంఘటితం కావాలన్నారు. చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశాకు శ్రమకు తగిన వేతనాలు రావడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశ వర్కర్ల వేతనాలను పెంచాలని, వారికి అన్ని రకాల బెనిఫిట్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం ఆశా వర్కర్లు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

మహిళల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం లో మంగళవారం మహిళల చట్టాలు, హక్కులపై ఐసిడిఎస్ శిశు సంక్షేమం శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహిళలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, రోజు రోజుకి దాడులు పెరుగు తున్నాయని ఆమె తెలిపారు. ఆడపిల్లలు బాగా చదువుకొని తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని ఆమె సూచించారు. సైబర్ నేరగాళ్ల నుంచి మహిళలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.రాజ్యలక్ష్మి, ఎస్ఐ బి.సతీష్, వెలుగు ఎపిఎం చిన్నారావు పాల్గొన్నారు

మరమ్మతులు చేపట్టరూ..

ప్రజాశక్తి- పెదబయలు రూరల్ :బి.కొరవంగి పంచాయతీ బర్చులు గ్రామంలో తాగునీటి ట్యాంక్ గత ఏడాది క్రితం మరమ్మతుకు గురైంది.అధికారులకు పలు సార్లు సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందించలేదని ఈ సందర్భంగా గ్రామ పెద్ద పాంగి మల్లేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ అధికారి దృష్టి సారించి కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కొర్రా రంగన్న, కొర్రా రుక్మన్, చలపతి, తదితరులు కోరారు.

పాడైపోయిన ట్యాంకు

ఐదు అడుగుల అరటి గెల

ప్రజాశక్తి-పాడేరు

అల్లూరి సీతారామరాజుజిల్లా పాడేరు మండలంలో మినిమలూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు కుర్రం బాలన్న తన అరటి తోటలో దిగుబడి వచ్చిన ఐదు అడుగుల అరటి గెలను పాడేరు మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చాడు. అరటి గెల పెద్దగా ఉండటంతో అందరూ ఆసక్తిగా తిలకించారు.

20న మెగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు

మండలంలోని మారుముల ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల 20న మంగళవారం యువహెూ మెగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్సై కె.రవీంద్ర తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో యువత క్రీడల్లో ప్రతిభను వెలికి తీసేందుకు మెగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఎస్సై ఫోన్: 940904227, 940904233, జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫోన్: 940904222 నెంబర్లను సంప్రదించాలని ఎస్సై రవీంద్ర కోరారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరుటౌన్: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఐటిడిఎ సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతి సామాజిక వర్గానికి రాజ్యాంగ ఫలాలు అందేలా రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. ఆయన ఆశయాలు ఆచరణీయమని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఐటిడిఎ పరిపాలనాధికారి హేమలత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: అంబేద్కర్ ఆశయాలకు సాధనకు కృషి చేయాలని ఎంపీపీ కూడా రాజబాబు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంపీపీ రాజబాబు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధన కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, వీఆర్వో కొండబాబు, పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సూరయ్య, మాజీ జెడ్పిటీసీ కొంట సూర్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెండ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : భారత రాజ్యాంగ నిర్మాత, మహా మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నెర వేర్చడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీత రామయ్య, నాయకులు ఆవుల ఉపేంద్ర, మురళి, శ్రీనివాసరావు, బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, రాధ తదితరులు పాల్గొన్నారు

చింతూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సంరద్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంబేద్కర్ చాలా పేదరికంలో పుట్టి ఆనాడు ఉన్న కుల అధిపత్యంతో అనేక బాధలు అనుభవించి ఉన్నత చదువులు చదివారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటరావు మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే త్యాగం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.శేఖర్, అప్పనమ్మ, హారతి, శకుంతల, రాజబాబు, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, మౌనిక, ఇమ్మనియేలు, అలివేలు పాల్గొన్నారు.

రంపచోడవరం : దళిత సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రాజు ఆధ్వర్యంలో రంపచోడవరం వాల్మీకి పేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రంపచోడవరం మాజీ సర్పంచ్ నిరంజని దేవి, అక్కిస బాలు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ రిజర్వేషన్ వల్ల ఉచిత విద్య, ఉద్యోగాలు దళిత ఆదివాసీలకు కల్పించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోసు, భూచక్రిని, అచ్యుత, అఖిల్, నవీన్, మున్నా, సురేష్, చిరంజీవి ,మధు, సుధీర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న సిపిఎం నాయకులు

వైసిపికి గుణపాఠం తప్పదు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: రాష్ట్రానికి పట్టిన ఖర్మను వదిలించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాడేరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. టిడిపి పార్టీ పిలుపుమేరకు పాడేరు మండలం వంతాడపల్లిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వంలో సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగాయని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, ఎంవివి ప్రసాద్, విజయరాణి, పొలుపర్తి గోవిందరావు, వంజంగి కాంతమ్మ, కొట్టగుల్లి సుబ్బారావు, గబ్బాడ సింహాచలం, కోడా వెంకటసురేష్ కుమార్, బుక్క జగదీష్, గంగ పూజారి శివకుమార్, బుద్ధ జ్యోతికిరణ్, పారిజాతం(గిరి) శివశంకర్, మర్ల మణి, కర్రీ దొర, సత్యనారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: టిడిపి నాయకులు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశాలతో మండల కేంద్రంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై పల్లె పల్లెకు తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నేతలు నీలకంఠం పాత్రో, నైకం శంకర్రావు, మాజీ సర్పంచ్ రుక్మాందర్, మాజీ సర్పంచ్ చెండా పంతులు, టిఎన్ఎస్ఎఫ్ చిరంజీవి, కూడా సుబ్రహ్మణ్యం, వంతాల రాము, కిల్లో ధన్య, కొర్ర బుద్రన్న, చెండా గోపాల్, లోకినాయక్ బలరాం, మఠం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

20న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 20న మంగళవారం సంజీవని మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎస్సై కె.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఈ మెగా వైద్య శిబిరానికి పిల్లలు, కంటి సంబంధిత వ్యాధులకు స్పెషలిస్ట్ వైద్యులు హాజరు కానున్నారన్నారు. వైద్య శిబిరం ఉదయం 10గంటల నుండి నిర్వహిస్తామని, హాజరైన వారికి భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వైద్య శిబిరాన్ని మారు మూల గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రవీంద్ర కోరారు.

సకాలంలో స్పందిస్తే ప్రాణాలు పదిలం

- నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

ప్రజాశక్తి - ఆరిలోవ : రహదారి ప్రమాదాలు, గుండె సమస్యలు సంభవించినప్పుడు సకాలంలో స్పందించి స్వల్ప వ్యవధిలో ఆసుపత్రికి తరలిస్తే విలువైన ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువ ఉంటుందని నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ అన్నారు. ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రిలో మంగళవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే 1066 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు లోను కాకుండా అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇస్తే పోలీసులు, కోర్టులు చుట్టూ తిరగాలనే అపోహలు పెట్టుకోవద్దన్నారు. అపోలో సీనియర్ కార్డియాలజిస్ట్ దివ్య కుమార్ బారువా మాట్లాడుతూ, గుండె పోటుకు గురైన వ్యక్తికి ఎటువంటి ప్రాథమిక చికిత్స చేయాలి, తక్కువ సమయంలో అందుబాటులో అన్ని సౌకర్యాలు ఉన్న ఆసుపత్రికి చేర్చే విషయంపై అవగాహన కల్పించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ నందకుమార్ పాణిగ్రహి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గోల్డెన్ అవర్‌ను ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. డాక్టర్ మధుసూధనరావు, డాక్టర్ రవిరాజ్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలు, గుండె వ్యాధులపై ఎలా స్పందించాలో వివరించారు. అనంతరం ఆరిలోవ అపోలో సిబ్బంది, యువకులు అపోలో ఆసుపత్రి నుంచి చినగదిలి మీదుగా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ వరకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ బైకు ర్యాలీ నిర్వహించారు.

గ్యాట్ - 2023కు దరఖాస్తులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ (బిటెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్. ఫార్మశీ), ఎమ్.ఆర్క్, మేనేజ్‌మెంట్, లా, సైన్స్, హ్యూమనిటీస్, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకుగాను జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం వెల్లడించారు. గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)- 2023 పేరిట జరిగే ప్రవేశ పరీక్షల ద్వారా గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను అకడమిక్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌తో కలిసి ఆవిష్కరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు గ్యాట్-2023 ప్రవేశ పరీక్షను దేశ వ్యాప్తంగా 134 కేంద్రాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 2 గంటల కాలవ్యవధితో 200 మార్కులకు జరిగే ప్రవేశ పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయని, ప్రతి ప్రశ్నకూ రెండు మార్కులు ఉంటాయని తెలిపారు.

ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్ షిప్

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభ స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు వీసీ ప్రకటించారు. గీతం ప్రవేశ పరీక్ష, జెఇఇ మెయిన్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో, ఎపి ఇఎపి సెట్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశ పరీక్షలతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించిన వారికి ఫీజులో రాయితీ అందిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి కొత్తగా గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందజేస్తున్నామని తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షల పూర్తి వివరాలు, దరఖాస్తు చేసుకునేందుకు www.gitam.edu వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రగ్గులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పవన్ ప్రియరాజ్ దంపతులు

రగ్గులు, నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ, వలస గెడ్డ, వలస గెడ్డ కొత్తూరు గ్రామాలకు చెందిన గిరిజన వికలాంగులకు ఎపి జోన్‌కో ఇంజనీర్ పవన్ ప్రియరాజ్ దంపతులు మంగళవారం రగ్గులు, కందిపప్పు, ఉల్లిపాయలు తదితర సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్ ప్రియరాజు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన వికలాంగులకు ఆర్థికపరమైన సహాయం ప్రభుత్వం నుంచి అందకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న మహిళా పోలీసులు

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రేవళ్ళ గ్రామ శివారులో దాదాపు 800 లీటర్ల బెల్లం పులుపును రెవళ్ళ గ్రామ మహిళా పోలీసు, వాలంటీర్ల సహాయంతో ధ్వంసం చేశారు. అనంతరం రేవళ్ళ గ్రామంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామస్తులు నాటుసారాకు దూరంగా ఉండాలన్నారు. నాటు సారా, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

నేటి నుంచి అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక వెలుగు ఎంఆర్‌సి కార్యాలయాల్లో 2023-24 సంవత్సరానికి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ తరగతులు ఈ నెల 7 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న లబ్బర్తి, లాగరాయి, కింద్రా, కిర్రాబు, గడుఓకుర్తి, కొండపల్లి, శరభవరం, బడదనాంపల్లి పంచాయతీలకు, 8న రాజవొమ్మంగి, దూసరిపాము, తంటికొండ, జడ్డంగి, చెరుకుంపాలెం, అమీనాబాద్ పంచాయతీలకు, 9న చికిలింత, లోదొడ్డి, వాతంగి, మారేడుబాక, వంచంగి పంచాయతీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ తరగతులకు ఎంపీపీ, జెడ్పిటిసీ, ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

మత సామరస్యంపై ఆవాజ్ ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధి పొందేందుకు బిజెపి నిత్యం ప్రయత్నిస్తోందని ఆవాజ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత సంఘటన జరిగి 30 సంవత్సరాలైన సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పూర్ణా మార్కెట్ బౌరాడా రోడ్డులో మత సామరస్య ప్రదర్శన నిర్వహించారు. అర్చకుడు, ముస్లిం, ఫాదర్ వేషధారకులు ప్రదర్శన అగ్రభాగాన ఉండి హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ఐక్యతను చాటుతూ 'అందరం భాయీ..భాయి' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయుబ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిములు కీలకపాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ నిర్మాణంలో ముస్లిముల పాత్ర మరువలేనిదన్నారు. అలాంటి వారిపట్ల మెజారిటీ మతస్తులను రెచ్చగొట్టి తప్పుడు ప్రచారం సాగించడం దారుణమన్నారు. అభివృద్ధి, ఉద్యోగాల పేరుతో అధికారం చేపట్టిన బిజెపి మత విద్వేషాలతో యువతను తప్పుదోవపట్టిస్తోందన్నారు. సిపిఎం జోన్ నాయకులు వై.రాజు, స్థానిక ముస్లిం నాయకులు రెహమాన్, ఆవాజ్ నాయకులు అబ్దుల్ సమద్, షేక్ రబాని, అబ్దుల్ గఫర్, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, ఎం.సుబ్బారావు, కె.శేఖర్, కె.నర్సింగరావు, ఎం.సంజయ్, గణేష్ పాల్గొన్నారు.

పూర్ణా మార్కెట్ రోడ్డులో సాగుతున్న మత సామరస్య ప్రదర్శన

రూ.35 వేలు కట్టాల్సిందే..!

లేదంటే ఇల్లు రద్దు
సచివాలయ సిబ్బంది బలవంతపు వసూలు
మూడో ఆప్షన్ కింద ఇస్తున్న రశీదు
అప్పుల కోసం తిరుగుతున్న పేదలు
రుణమిప్పించే బాధ్యత గాలికి..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇళ్లు కట్టించి ఇస్తామంటే మురిసిపోయిన పేదలకు తక్షణం రూ.35 వేలు చెల్లించకపోతే మంజూరైన ఇల్లు రద్దవుతుందని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వారంతా ఇపుడు లబోదిబోమంటున్నారు. ఒక్కసారిగా రూ.35 వేలు కట్టలేమంటే, కట్టి తీరాల్సిందేనని ఒత్తిడి చేయడంతో అప్పు కోసం అవస్థలు పడుతున్నారు. జివిఎంసి పరిధిలోని పేదలకు ప్రభుత్వం పలుచోట్ల లే అవుట్లు వేసి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' కింద పిఎంఎవై అర్బన్ హౌసింగ్‌లో భాగంగా లక్షా 20 వేలు ఇళ్లు మంజూరయ్యాయి. ఇల్లు కట్టుకోలేని పేదలకు లక్షా ఎనభై వేల రూపాయల పూర్తి సబ్సిడీతో ఇళ్లు నిర్మించి అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇళ్ల నిర్మాణం రెండు పద్ధతుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపింది. సొంతగా ఇల్లు నిర్మించుకోవడం, నిర్మించుకోలేని పేదలకు ప్రభుత్వమే నిర్మించి అప్పగించడం చేస్తామని హామీ ఇచ్చింది. లక్ష ఇళ్ల నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. లక్షా 80 వేల రూపాయలకు ఇంటి నిర్మాణం పూర్తికాదని, మరో రూ.35 వేలు లబ్ధిదారుని వాటా కింద చెల్లించేందుకు పావలా వడ్డీకి స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణం ఇప్పిస్తామని ప్రభుత్వం బాధ్యత పడింది. ఈ క్రమంలో సంఘాల్లో లేని సభ్యులకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించాల్సి వుంది. కానీ దీనికి విరుద్ధంగా ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, కాంట్రాక్టర్లకు డబ్బులు ఇచ్చేందుకు లబ్ధిదారులపై సచివాలయ సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారు. రూ.35 వేలు ఒకేసారి చెల్లించకుంటే ఇల్లు రద్దు అవుతుందని బెదిరించడంతో పేదలంతా అప్పుల కోసం తిరుగుతున్నారు. రూ.35 వేలు కడితే మూడు నెలల్లో ఇల్లు పూర్తి చేసి అప్పగిస్తారని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. సబ్బవరం మండలంలోని పైడివాడ, ఎరుకునాయుడు పాలెం, పైడివాడ అగ్రహారం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ బాధ్యతను రాక్ క్రెట్ అనే నిర్మాణ సంస్థకు అప్పజెప్పారు. ఇక్కడ ఇళ్లు మంజూరైన అర్బన్ లబ్ధిదారుల నుంచి రూ.35 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కాంట్రాక్ట్‌కు ఇల్లు నిర్మాణం ఇచ్చేందుకు సమ్మతించిన లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో పేదలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. అప్షన్ 3 కింద గృహ నిర్మాణ లబ్ధిదారుల నుంచి రూ.35 వేలు వసూలు చేస్తున్నట్లు సచివాలయ సిబ్బంది రశీదులు ఇస్తున్నప్పటికీ డబ్బులు కట్టలేక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

డబ్బులు వసూలు చేయడం లేదు : యుసిడి పీడీ పాపునాయుడు

డబ్బుల వసూలు విషయాన్ని జివిఎంసి యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు వద్ద ప్రస్తావించగా.. లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయడంలేదని తెలిపారు. స్వయం సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పిస్తామన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు మాట్లాడుతున్నామని చెప్పారు.


రశీదు
(లబ్ధిదారుని కాపీ)
గ్రామ/వార్డు సచివాలయం YERUKULASTREET - 21086377 (సచివాలయం పేరు మరియు కోడ్)
VISAKHAPATNAM జిల్లా
రశీదు నెం.: 05210863770605 తేదీ: 03/12/2022
లబ్ధిదారుని పేరు: BONDILI NAGAMANI BAI తండ్రి/భర్త పేరు: BEKAM SRINIVASA SING
హౌసింగ్ ఐ డి నెం.: 058205NPI5745769 పి ఎం ఎ వై ఐ డి నెం: 0328802947950455764
లేఅవుట్ పేరు: GVMC PYDIWADA YERUKUNAIDUPALEM PYDIWADA AGRAHARAM ఖాతా నెం.: 110066529236
35000.00 (అక్షరాలా THIRTY FIVE THOUSAND RUPEES ONLY. రూపాయలు మాత్రమే)
110066529236
YERUKULASTREET - 21086377 సచివాలయం

నాగమణి బాయి కట్టిన డబ్బులకు సచివాలయ సిబ్బంది ఇచ్చిన రశీదు

అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అడ్డతీగల : మండల కేంద్రంలోని అనూప్ డిగ్రీ కాలేజీలో తహాశీల్దారు శ్రీనివాస్ మంగళవారం ఓట్లు నమోదుపై యువతీ యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనూప్ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ చీకట్ల ఆశీర్వాదం, వీఆర్వో బాలయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వాహనాల వేలం

ప్రజాశక్తి - ఎటపాక : నాటుసారా, అక్రమంగా మద్యం రవాణా వంటి నేరాల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎటపాక సిఐ గజేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ రవాణాలో పట్టుబడిన 30 వాహనాలను జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఎటపాక పోలీసు స్టేషన్‌లోనూ, మోతుగూడెం పోలీసు స్టేషన్‌నూ వేలం వేస్తునట్టు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు వారి ఆధార్ కార్డు జెరాక్సు కాపీ తీసుకుని, ధరవాత్తు సొమ్మును జమ చేయాలని కోరారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు పాడిన మొత్తాన్ని వెంటనే చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో బాపన్నదొర

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వికలాంగులు అనేక రంగాల్లో రాణిస్తూ మంచి ప్రతిభ కనబరుస్తున్నారని, వారిని ఇంకా ప్రోత్సహించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం స్థానిక ఎంఈఓ కె.తాతబ్బాయిదొర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్న దొర మాట్లాడుతూ వికలాంగుల పట్ల చిన్నచూపు తగదన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ఎస్ఎస్ఎ ద్వారా అందజేసిన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన పాఠశాల హెచ్ఎం నాగరాజు, భవిత కేంద్రం ఫిజియోథెరపీ వైద్యులు ఎన్ నాగరాజు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు ఎం.రాజేష్ బాబు, సిహెచ్ రాజ్యలక్ష్మి, సీఆర్పీలు శ్రీను, విష్ణు, సతీష్, మంగరాజు, ఆదినారాయణ, ఎంఆర్‌సి సిబ్బంది ఉషాబాల, సుజాత, భవిత కేంద్ర విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.